సాక్షి
మంచిర్యాల

ఆదివారం । 20 । జూలై । 2025



గిరి గూడేలకు పండుగ శోభ

ఆదివాసీ గిరిజన గూడేలు పండుగ శోభను సంతరించుకున్నాయి. అకాడితో ప్రారంభమయ్యే పండుగలు నాలుగు నెలల తర్వాత దీపావళితో ముగుస్తాయి. 8లో▸



ఘనంగా బోనాల సంబురాలు

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల్లో శనివారం బోనాల సంబురాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు పోతరాజులు, అమ్మవారి వేషధారణల్లో ఆకట్టుకున్నారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
34.0 /27.0

ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. ఉక్కపోతగా ఉంటుంది. ఈదురుగాలులు బలంగా వీస్తాయి.

న్యూస్‌రీల్

ఉపాధ్యాయురాలి సస్పెన్షన్

చెన్నూర్‌రూరల్: మండలంలోని అక్కెపల్లి గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు ఫర్హీనాభానును సస్పెండ్ చేస్తూ డీఈవో యాదయ్య ఉత్తర్వులు జారీ చేశారని ఎంఈవో రాధాకృష్ణమూర్తి తెలిపారు. ఆమె పాఠశాలకు సరిగా రావడం లేదని, విద్యార్థులను దుర్భాషలాడుతున్నారని, తరగతులు తీసుకోవడం లేదని పేర్కొన్నారు. పలు ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ చేశారని తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలి



క్రీడ సామగ్రి అందిస్తున్న డీఐఈవో అంజయ్య

కాసిపేట: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని ఇంటర్మీడియెట్ విద్యాధికారి(డీఐఈవో) అంజయ్య సూచించారు. శనివారం ఆయన మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విద్యాసంవత్సరం సమయసారిణిలో ప్రతీ శనివారం కాలేజీ విద్యార్థుల ఆటలకు ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలిపారు. క్రీడలు ప్రారంభించి క్రీడాసామగ్రి అందజేశారు. ప్రతీరోజు వ్యాయామం, క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం సమకూరుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకర్, పీడీ బాబురావు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

యూరియాపై ఆందోళన వద్దు



గోదాంను పరిశీలిస్తున్న ఛత్రునాయక్

వేమనపల్లి: యూరియా నిల్వలు లేవని రైతులు ఆందోళన చెందకూడదని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఛత్రునాయక్ అన్నారు. రైతులకు సరిపడా యూరియా నిల్వలు అన్ని ఫర్టిలైజర్, పీఏసీఎస్, డీసీఎంఎస్ కేంద్రాల్లో నిల్వ ఉన్నాయని తెలిపారు. మండలంలోని నీల్వాయి, ముల్కలపేట, గొర్లపల్లి, సుంపుటం గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో యూరియా అమ్మకాల తీరును పరిశీలించారు. రశీదులు, నిల్వల రిజిష్టర్ పరిశీలించారు. ప్రతీ రైతు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫార్మర్ రిజిష్టర్‌లో తప్పక పేరు నమోదు చేయించుకోవాలని, అలాగైతేనే పీఎం కిసాన్‌కు అర్హులని తెలిపారు. ఏఓ వీరన్న, ఏఈఓలు రుక్సార్ సుల్తానా, ఎఫ్సిబా పాల్గొన్నారు.

సీతాకోక చిలుకలు, పక్షులపై అధ్యయనం



అధ్యయనంలో అధికారులు, వన ప్రేమికులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): లక్సెట్టిపేట అటవీ రేంజ్ పరిధిలోని పాత మంచిర్యాల అటవీ బీట్, ఎంసీసీ క్వారీ అడవిలోని గాంధారీ ఖిల్లా జంగల్ సఫారీలో శనివారం సీతాకోక చిలుకలు, పక్షులపై అధ్యయనం చేశారు. మహారాష్ట్రకు చెందిన వైల్డ్ లైఫ్ వార్డెన్ డాక్టర్ రంజన్ విరనీ, లక్సెట్టిపేట అటవీ రేంజ్ అధికారి అత్తె సుభాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అధ్యయనంలో 30 రకాల సీతాకోక చిలుకలు, వివిధ రకాల పక్షులను గుర్తించారు. ఈ కార్యక్రమంలో లక్సెట్టిపేట రేంజ్ పరిధిలోని ఎఫ్ఎస్ఓలు, ఎఫ్‌బీఓలు, వన ప్రేమికులు పాల్గొన్నారు.

‘ఎన్నికల్లో పోటీకి సిద్ధంకండి’

బెల్లంపల్లి: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు. శనివారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మండల కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోందని తెలిపారు. బెల్లంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలను ఇంజినీరింగ్ కళాశాలగా అప్‌గ్రేడ్ చేయాలని, ఆర్టీసీ బస్‌డిపో మంజూరు చేయాలని, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టు నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి బి.లక్ష్మీనారాయణ, జిల్లా సమితి సభ్యుడు మేకల రాజేశం, మండల కార్యవర్గ సభ్యులు గోమాస గంగారాం, సహదేవరావు, బుడిమే వెంకటేష్, కందుల సుదర్శన్, మేకల తిరుపతి, కలాలి భూమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల భూములపై రియల్ గద్దలు



ఈ చిత్రంలో కనిపిస్తున్న దళిత రైతు పేరు మాలెం రమాదేవి. ఏళ్లుగా ఈ భూమిలో తమ తాత కాలం నుంచి కాస్తులో ఉంటున్నారు. పంటలు సాగు చేసుకుంటున్నారు. వీరి తండ్రి చనిపోగా.. నలుగురు అక్కాచెల్లెళ్లు, ఓ కుమారుడు ఉన్నారు. రెండ్రోజుల క్రితం పత్తి చేనును రాత్రివేళ వచ్చి గుర్తు తెలియని వ్యక్తులు ట్రాక్టర్‌తో చదును చేసి ధ్వంసం చేశారు. గత కొంతకాలంగా తాము సాగులో ఉన్న భూమి కబ్జాకు కొందరు ప్రయత్నిస్తున్నారని బాధితులు మంచిర్యాల పోలీసుస్టేషన్, తహసీల్దార్‌ను కలిసి ఫిర్యాదు ఇచ్చారు. ప్రస్తుతం విచారణ జరుగుతోంది.



ట్రాక్టరుతో ధ్వంసం చేసిన పత్తి చేను

- ఏళ్లుగా కబ్జాలో ఉన్న రైతులకు బెదిరింపులు
- తాజాగా సాగు చేస్తున్న పంటలు ధ్వంసం
- సర్వేనంబరు 345లో అనేక అక్రమాలు
- హక్కులు కల్పించాలని దళితుల వేడుకోలు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: నిరుపేద దళితుల భూములపై రియల్ ఎస్టేట్ గద్దలు వాలుతున్నాయి. జిల్లా కేంద్రంలోని రాజీవ్‌నగర్‌లో ఉన్న సర్వేనంబరు 345లో అనేక అక్రమాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సర్వే నంబరులో రికార్డులు మార్చేస్తున్నారు. ఇదే సర్వేనంబరులో జంగ్‌సిపాయిలకు చెందిన భూములు 60ఎకరాల చొప్పున మొత్తం 120 ఎకరాలు ఉంది. ఈ భూముల్లో రైతులు సాగులో ఉన్నారు. ఈ భూములను సిపాయిల వారసులుగా కొందరు రంగప్రవేశం చేసి రియల్ వ్యాపారులకు రిజిస్ట్రేషన్లు చేశారు. జిల్లా కేంద్రంలో ఉండడం, డబుల్ బెడ్రూం ఇళ్ల నిర్మాణం చేపట్టడంతోపాటు జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ భూములపై కొందరు కన్నేసి భూ దందాలకు పాల్పడుతున్నారు. నిరుపేద దళితులు ఉన్న ఈ భూములపై ఏళ్లుగా సాగులో ఉన్నా హక్కులు లేకపోవడంతో అడ్డదారిలో భూములు లాక్కునే ప్రయత్నాలు చేస్తున్నారు.

రికార్డులు మార్చేస్తూ..

రాజీవ్‌నగర్ సమీపంలో ఉన్న 345 సర్వేనంబరులో జంగ్ సిపాయి భూములతోపాటు మరో వంద ఎకరాలకు పైగా ప్రభుత్వ భూమి ఉంది. ఈ భూముల్లో మందమర్రి మండలం అమర్వాదికి చెందిన పలువురు రైతులు ఏళ్లుగా సాగులో ఉన్నా హక్కులు పొందలేకపోయారు. దీంతో ఇదే అదునుగా రికార్డులు మార్చుతూ తమకు అనుకూలంగా చేసుకుంటూ అనేమందికి తక్కువ ధర ఆశ చూపిస్తూ అమ్మేశారు. అయితే కబ్జాలో వేరే రైతులు, రికార్డుల్లో మాత్రం వేరేవాళ్లు ఉన్నారు. దీంతో కబ్జాలో ఉన్న వారిని బలవంతంగా ఆ భూముల నుంచి లేకుండా చేసే ప్రయత్నాలు చేస్తున్నారు. తమకు తెలియకుండానే భూముల రిజిస్ట్రేషన్లు కావడంతో ఆందోళన చెందుతున్నారు. మరోవైపు వివాదాలు ఉన్నాయని పెట్టుబడి పెట్టి కొనుగోలు చేసిన వారంతా ఇబ్బందుల్లో పడ్డారు.

అర్జీలు ఇస్తున్నా హక్కులు రాలే..

ఏళ్లుగా ఇక్కడ సాగులో ఉన్నప్పటికీ భూయాజమాన్య హక్కులు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో కొందరు నయానో, భయానకో రియల్ వ్యాపారులకు విలువైన భూములను అమ్మేసుకుంటున్నారు. అయితే కొందరు కాస్తులో ఉన్నవారు భూ ప్రక్షాళన, ధరణి సందర్భంలోనూ అర్జీలు ఇచ్చినప్పటికీ పట్టాలు రాలేదు. మరోవైపు కబ్జాలో ఉన్న వారికి భూమిపై హక్కులు రావని చెబుతూ రియల్‌వ్యాపారులే బెదిరిస్తూ ఆ భూముల్లో లేకుండా చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఈ భూములపై పూర్తి స్థాయిలో అధికారులు దర్యాప్తు చేసి తమకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

నగర పాలన అస్తవ్యస్తం

- సెలవులో వెళ్లిన రెగ్యులర్ కమిషనర్
- లక్సెట్టిపేట కమిషనర్‌కు అదనపు బాధ్యతలు
- చెక్‌పవర్, అధికారాలు లేవు!
- కొరవడిన పారిశుద్ధ్యం.. రెండు డెంగీ కేసులు నమోదు



హైటెక్‌సిటీ కాలనీలో డ్రెయినేజీల నుంచి రోడ్డు పైకి చేరిన మురుగు నీరు

మంచిర్యాలటౌన్: మంచిర్యాల నగరపాలక సంస్థ పాలన అస్తవ్యస్తంగా మారింది. రెగ్యులర్ కమిషనర్ శివాజీ ఈ నెల ఒకటి నుంచి 15వరకు సెలవుపై వెళ్లారు. దీంతో ఈ నెల 2న కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ రాజమనోహర్‌కు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ ఇంచార్జి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఒక్కరోజు వ్యవధిలోనే లక్సెట్టిపేట కమిషనర్ సంపత్‌కుమార్‌కు ఈ నెల 15వరకు ఇంచార్జిగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నెల 15వరకు ఇంచార్జి కమిషనర్ గడువు ముగిసింది. రెగ్యులర్ కమిషనర్ రాకపోవడంతో ఇప్పటికీ లక్సెట్టిపేట కమిషనర్ ఇంచార్జిగా కొనసాగుతున్నారు. చెక్‌పవర్‌తోపాటు ఇతరత్రా అధికారాలు లేకపోవడంతో అభివృద్ధితోపాటు పారిశుద్ధ్య పనులు సక్రమంగా చేపట్టడం లేదు. నస్పూరు, మంచిర్యాల మున్సిపాలిటీలతోపాటు హాజీపూర్ మండలంలోని ఎనిమిది గ్రామాలను విలీనం చేసి మంచిర్యాల కార్పొరేషన్‌గా మార్చడంతో పరిధి విస్తృతంగా పెరిగింది. రెగ్యులర్ కమిషనర్ లేకపోవడంతో ప్రజలకు మౌలిక వసతులు కరువయ్యాయి. సెలవులో వెళ్లిన కమిషనర్ శివాజీ తిరిగి విధుల్లో చేరడమో, కొత్త కమిషనర్ బాధ్యతలు చేపట్టడమో చేసే వరకు పాలన గాడినపడడం కష్టమే.

వర్షాకాలం... రోగాల మయం

ప్రతియేటా వర్షాకాలానికి ముందే పారిశుద్ధ్య పనులు అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లో చేపట్టాల్సి ఉంది. కానీ కార్పొరేషన్‌లో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. వర్షాలు కురుస్తుండడం, డ్రెయినేజీల్లో పూడిక పెరిగి మురుగునీరు రోడ్లపై పారుతుండడం, రోడ్లు డ్రెయినేజీ నీటితో నిండి ఉండడం వల్ల దుర్వాసన వెదజల్లుతోంది. నగరంలోని హైటెక్‌సిటీ కాలనీలోని రోడ్లపై డ్రెయినేజీ నీరు నిండి ప్రజలు ఇళ్లలో నుంచి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రోజుల తరబడి డ్రెయినేజీ నీరు రోడ్లపై పేరుకుపోయి దోమలకు ఆవాసంగా మారి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. హైటెక్‌సిటీలో డెంగీ కేసు నమోదు కాగా, వందలాది మంది జ్వరాల బారిన పడ్డారు. నస్పూరులోనూ అదే పరిస్థితి. ఒక డెంగీ కేసు నమోదు కాగా, ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారు. పారిశుద్ధ్యాన్ని పట్టించుకోకపోవడం, చెత్తాచెదారం, డ్రెయినేజీ నీరు రోడ్లపై పారుతుండడంతో సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

వంద రోజుల కార్యాచరణ అమలేది?

ప్రభుత్వం రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జూన్ 2నుంచి సెప్టెంబర్ 10వరకు వంద రోజులపాటు సమస్యలు లేని పట్టణాలుగా మార్చే కార్యక్రమాన్ని ప్రారంభించింది. వంద రోజుల కార్యాచరణలో వార్డుల్లోని ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడం, డ్రెయినేజీలు, వర్షపు నీటి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టాలి. ఇప్పటికే 50రోజులు పూర్తి కాగా, మరో 50 రోజుల్లో కార్యక్రమాలు చేపట్టేందుకు రెగ్యులర్ కమిషనర్ లేకపోవడం అడ్డంకిగా మారుతోంది. పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చి స్వచ్ఛతపై ఇంటింటి ప్రచారం చేయడంపై అధికారులు దృష్టి సారించకపోవడంతోనే సీజనల్ వ్యాధులు ప్రబలుతున్నాయి. సాక్షాత్తు జిల్లా కేంద్రంలోనే పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారినా జిల్లా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం, నగర శివారు ప్రాంతాల్లో మురుగు నీరు, చెత్తాచెదారం పేరుకు పోవడం గమనార్హం.

‘ఉపాధి’ కూలీలకు బీమా.. ధీమా

- జిల్లాలో కూలీలు 1,33,177
- యాక్టివ్ జాబ్‌కార్డులు 82,020



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు

దండేపల్లి: గ్రామాల్లో వలసల నివారణకు అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం ఎంతోమందికి ఉపాధి కల్పిస్తోంది. కూలీలకు ఏదైనా ప్రమాదం జరిగితే ఆదుకునేలా బీమా సౌకర్యం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై)లో చేరితే బాధితులకు పరిహారం అందిస్తారు. ఈ మేరకు తాజాగా ఉత్తర్వులు వెలువడ్డాయి. జిల్లాలో 82,020 యాక్టివ్ జాబ్‌కార్డులు ఉండగా.. 1,33,177 మంది ఉపాధి హామీ పథకం కూలీలు ఉన్నారు. బీమా యోజన పథకంలో చేరిన వారు మరణించినా, అంగవైకల్యం బారిన పడ్డా రూ.2లక్షల పరిహారం చెల్లిస్తారు. ఒకవేళ పాక్షిక అంగవైకల్యం కలిగితే రూ.లక్ష పరిహారం ఇస్తారు. ఈ పథకంలో చేరేందుకు జూలై నెలాఖరు వరకు గడువు విధించారు. 18 ఏళ్ల నుంచి 70 ఏళ్లలోపు వారు అర్హులు కాగా, బ్యాంకు ఖాతా ఉన్నచోటే పేర్లు నమోదు చేయాలి. ఖాతాకు ఆధార్ సంఖ్య అనుసంధానించాలి. పథకంలో పేరు నమోదు చేయించాక, ఏటా ఖాతా నుంచి రూ.20 బీమాకు జమ అవుతుంది. రాతపూర్వకంగా లేఖ ఇవ్వడం తప్పని సరి. అలా అయితేనే పథకం అమల్లోకి వస్తుంది. ఈ మేరకు ఉపాధి హామీ పథకం ఉద్యోగులు, సిబ్బంది నమోదుకు శ్రీకారం చుట్టారు. మండల స్థాయిలో ఏపీవోలు, సాంకేతిక సహాయకులు పేర్లు నమోదు చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక బ్యాంకు ప్రతినిధులు సమ్మతి తెలియజేస్తూ కూలీలకు పత్రాలు అందజేస్తారు. ప్రక్రియ మొదలైందని, అర్హులైన కూలీలు తప్పక బీమా చేయించుకోవాలని డీఆర్డీవో కిషన్ తెలిపారు.

సాగులో ఉన్న రైతులకు పట్టాలివ్వాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌గౌడ్

చెన్నూర్: కోటపల్లి మండలం సర్వాయిపేట గ్రామంలో 70ఏళ్లుగా సాగులో ఉన్న రైతులకే పట్టాలివ్వాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్ అన్నారు. బీజేపీ నాయకులు సర్వాయిపేట గ్రామాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. శనివారం చెన్నూర్ బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 15 మంది రైతులు సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. రైతుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని కొందరు సేత్వార్ ద్వారా పట్టా చేయించుకున్నారని ఆరోపించారు. జిల్లా మంత్రి, అధికారులు సర్వాయిపేట భూములపై మోకా సర్వే నిర్వహించి న్యాయబద్ధంగా సాగు చేసుకుంటున్న రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, పట్టణ అధ్యక్షుడు తుమ్మ శ్రీపాల్, కోటపల్లి మండల నాయకులు పెద్దింటి పున్నంచంద్, మంత్రి రామయ్య, కాశెట్టి నాగేశ్వర్‌రావు, కందుల వెంకటేష్, జాడి తిరుపతి, కమ్మల శ్రీనివాస్, వెంకటనర్సయ్య పాల్గొన్నారు.

ఉద్యోగుల సంక్షేమానికి కృషి

- బొగ్గు ఉత్పత్తిని పెంచాలి
- సింగరేణి డైరెక్టర్(పీపీ) కే.వెంకటేశ్వర్లు



ఫంక్షన్ హాల్‌ను ప్రారంభిస్తున్న కే.వెంకటేశ్వర్లు

శ్రీరాంపూర్: ఉద్యోగుల సంక్షేమానికి సంస్థ ఎల్లవేళలా కృషి చేస్తుందని సింగరేణి డైరెక్టర్(ప్రాజెక్ట్ అండ్ ప్లానింగ్) కే.వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో మహిళా ఉద్యోగుల కోసం ఏర్పాటు చేసిన శిశు సంరక్షణ కేంద్రం, నస్పూర్ కాలనీలో రూ.20 లక్షలతో నిర్మించిన గోదావరి ఫంక్షన్ హాల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో బొగ్గు ఉత్పత్తిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బొగ్గు ఉత్పత్తి పెంచాలని, ఓపెన్‌కాస్టు గనుల్లో ఓబీ లక్ష్యాన్ని అధిగమించాలని అన్నారు. నిర్దేశించిన ఓబిని తీస్తేనే బొగ్గు వెలికితీయవచ్చని, ఉత్పత్తితోపాటు రవాణా కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో శ్రీరాంపూర్ జీఎం ఎం.శ్రీనివాస్, ఎస్ఓటు డైరెక్టర్ మెహతా, ఏరియా ఎస్ఓటు జీఎం సత్యనారాయణ, ఏజీఎం(ఫైనాన్స్) బీభత్సా, గుర్తింపు సంఘం బ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, వర్క్‌షాప్ డీజీఎం రవీందర్, సివిల్ డీజీఎం ఆనంద్‌కుమార్, గుర్తింపు సంఘం నాయకుడు ముస్కె సమ్మయ్య, ఎం.కొమురయ్య, కొట్టే కిషన్‌రావు, పిట్ సెక్రెటరీ సందీప్, తదితరులు పాల్గొన్నారు.

‘మధ్యాహ్న’ వంటకు గ్యాస్



మధ్యాహ్న భోజనం వంట చేస్తున్న కార్మికులు

- మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు గ్యాస్ కనెక్షన్లు
- సర్కారు బడుల్లో ఆగస్టు 15లోపు పూర్తికి చర్యలు
- జిల్లా అధికారులకు విద్యాశాఖ డైరెక్టర్ ఆదేశాలు

మంచిర్యాలఅర్బన్: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీ నిర్వాహకులకు గ్యాస్ కనెక్షన్లు అందించేందుకు విద్యాశాఖ నిర్ణయించింది. ఏళ్ల క్రితం వంటపాత్రల స్థానంలో నాణ్యతతో కూడిన కొత్త పాత్రలు అందించిన ప్రభుత్వం ప్రస్తుతం గ్యాస్ కనెక్షన్ల మంజూరుపై దృష్టి సారించింది. కేంద్ర ప్రభుత్వం ఎల్‌పీజీని ఉపయోగించి మాత్రమే వంట చేయాలని సూచించింది. వర్షాకాలంలో కట్టెలు ఉపయోగించి భోజనం తయారు చేయడంలో వంట ఏజెన్సీలకు ఎన్నో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఆరుబయట కట్టెలతో వంట చేయడం వల్ల ఆహారం నాణ్యత, రుచి ప్రభావం కావడమే కాకుండా పొగ పీల్చడం, అపరిశుభ్రమైన పరిస్థితుల కారణంగా వంట చేసే వారు అనారోగ్యానికి గురి కావాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో అన్ని పాఠశాలల్లో వంట ఏజెన్సీల పేరిట ఎల్‌పీజీ కనెక్షన్ల జారీకి చర్యలు తీసుకోవాలని పౌరసరఫరాల శాఖ అధికారులకు ఆదేశాలు వచ్చాయి. గ్యాస్ కనెక్షన్ల మంజూరు ఆగస్టు 15లోపు పూర్తి చేయాలని డీఈవో, డీఆర్‌డీవోలకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ ఉత్తర్వులు జారీ చేశారు.

అన్ని పాఠశాలలకు..

మధ్యాహ్న భోజనం ఆరంభంలో 747 పాఠశాలల్లో 71 బడులకు మాత్రమే గ్యాస్ పంపిణీ చేశారు. వీటిలో బెల్లంపల్లి మండలంలో 28, కాసిపేట 4, మందమర్రి 8, చెన్నూర్ 14, జన్నారం 8, తాండూర్ మండలంలో 9 పాఠశాలలకు మాత్రమే గ్యాస్ సరఫరా చేశారు. మొదట్లో గ్యాస్ సరఫరా చేసినా ఆ తర్వాత అటకెక్కాయి. మిగతా పాఠశాలలకు గ్యాస్ కనెక్షన్, పొయ్యిల పంపిణీ విస్మరించారు. దీంతో కట్టెల పొయ్యిపై వంట చేస్తూ పొగతో కార్మికులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులకు గురవుతున్నారు. గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేయాలని వంట కార్మికులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు.

సిలిండర్ సరఫరా ఎలా..

గ్యాస్ కనెక్షన్ ఇచ్చినా నెల నెలా సిలిండర్ సరఫరా చేస్తారా లేదా అనేది తెలియాల్సి ఉంది. నెలకు ఎన్ని గ్యాస్ సిలిండర్లు అవసరమవుతాయో తెలియదు. వంట ఏజెన్సీ నిర్వాహకులే కొనుగోలు చేయాలంటే ఆర్థికభారం తప్పేలా లేదు. ఏజెన్సీలకు చెల్లించేది అంతంత మాత్రమే కావడంతో సిలిండర్ల కొనుగోలుకు విముఖ వ్యక్తమవుతోంది. ఉచితంగా సరఫరా చేయకుంటే మళ్లీ మొదటికొచ్చి కట్టెలపొయ్యే దిక్కయ్యేలా ఉంది.

స్కూళ్లలో ఇలా..

సర్కారు బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్నారు. వంట బాధ్యతలు మహిళా సంఘాలకు అప్పగించారు. జిల్లాలో పాఠశాలకో ఏజెన్సీ చొప్పున 747 ఏజెన్సీల్లో 1290మంది మధ్యాహ్న భోజన కార్మికులు వంట చేస్తున్నారు. నెలకు 66,953 కిలోల సన్నబియ్యం సరఫరా అవుతున్నాయి. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు రూ.14లక్షల వరకు, ఏడో తరగతి వరకు రూ.10లక్షల బడ్జెట్ మంజూరవుతోంది. తొమ్మిది, 10వ తరగతి విద్యార్థులకు రూ.10.67 చొప్పున చెల్లిస్తున్నారు. ఇప్పటికే ప్రభుత్వం వంట పాత్రలకు రూ.63లక్షలు మంజూరు చేయగా.. అన్నం గిన్నెలు, స్టీలు బకెట్లు, గరిటెలు తదితర పాత్రలు కొనుగోలు చేశారు. వంటగది లేక ఇబ్బందులు తప్పడం లేదు. ఒకే గదిలో స్టోర్‌రూం, వంటపొయ్యి(కట్టెల పొయ్యి) ఏర్పాటుతో పొగ బయటకు రాక ఊపిరిసలపని పరిస్థితి. మన ఊరు–మన బడి కింద చేపట్టిన 27 పనుల్లో 11 పూర్తి కాగా 16 పనులు కొనసాగుతూనే ఉన్నాయి. మిగతా పాఠశాలల్లో రేకుల షెడ్ అనువుగా లేకపోవడంతో ఆరుబయటే వంట చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం వంట గదుల నిర్మాణంతోపాటు నెలకు అవసరమైన సిలిండర్లు సరఫరా చేయాలని వంట నిర్వాహకులు కోరుతున్నారు.

సీఆర్‌టీల నియామకం చేపట్టాలి



వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ నాయకులు

కాసిపేట: జిల్లాలో సీఆర్‌టీల నియమాకం చేపట్టాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి నాయకులు కోరారు. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి సమస్య వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో సీఆర్‌టీల నియామకం చేపడుతుండగా, జిల్లాలో పోస్టులు లేవని, దరఖాస్తులు చేసుకోవద్దని బోర్డు పెట్టడం ఏమిటని ప్రశ్నించారు. జిల్లాలో ఒక్క ఎస్టీటీ పోస్టు సైతం ఖాళీ లేదా అధికారులు సమాధానం చెప్పాలని, వెంటనే ఖాళీల వివరాలు ప్రకటించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అడ జంగు, ఆదివాసీ నాయక్‌పోడ్ పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గంజి రాజన్న, పెండ్రం హన్మంతు, పెద్ది భార్గవ్, మడావి అనంతరావు, ఆత్రం జంగు, సంద్ర భూమన్న తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహనకు సదస్సులు



సదస్సులో మాట్లాడుతున్న సివిల్ జడ్జి రవి

భీమారం: ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పించేందుకే న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని చెన్నూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి పర్వతనేని రవి తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఏర్పాటు చేసిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆయన మాట్లాడారు. చట్టాలపై తెలుసుకుంటే ఎలాంటి నేరాలకు ఎలాంటి శిక్ష ఉంటుందనే విషయం తెలుస్తుందన్నారు. న్యాయశాఖ ద్వారా ప్రజలతోపాటు విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఎస్సై శ్వేత, ఎంపీవో సతీష్‌రెడ్డి, న్యాయవాదులు రాజ్‌కుమార్, రాజేష్ , పున్నం, లక్ష్మణ్ పాల్గొన్నారు.

తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇవ్వండి

కోటపల్లి: గుణాత్మక విద్యనందించాలంటే ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడిని ఇవ్వాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సభ్యత్వ అభియాన్‌లో భాగంగా మండలంలోని వివిధ పాఠశాలల్లో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్యను గణనీయంగా పెంచారని తెలిపారు. ఇద్దరు ఉపాధ్యాయులు ఐదు తరగతులకు ఎలా న్యాయం చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారని, దీనికి ప్రభుత్వమే సమాధానం చెప్పాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల నాయకులు శ్రీకాంత్, తిరుపతి, ఉపాధ్యాయులు రంజిత్, రామకృష్ణ పాల్గొన్నారు.

క్లుప్తంగా

కౌలురైతు బలవన్మరణం



గజేందర్ (ఫైల్)

కుంటాల: కుంటాలకు చెందిన కౌలు రైతు రాజారాం గజేందర్ (49) అప్పులు తీర్చలేక ఆత్మహత్య చేసుకున్నాడు. శనివారం తెల్లవారుజామున స్థానిక ఉన్నత పాఠశాల సమీపంలోని పంట చేనులో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఏఎస్సై జీవన్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. గజేందర్ మూడేళ్లుగా 10 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నాడు. అయితే, ఆశించిన మేర దిగుబడి రావడం లేదు. దీంతో పెట్టుబడి, కౌలు చెల్లింపు కోసం అప్పులు చేశాడు. వచ్చిన దిగుబడి అప్పులు, వడ్డీలకు సరిపోవడం లేదు. ఇప్పటికీ రూ.3.60 లక్షల అప్పు ఉంది. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా లేదు. దీంతో మనస్తాపం చెందిన గజేందర్ అప్పులు ఎలా తీర్చాలన్న బెంగతో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు. గజేందర్ తండ్రి రాజారాం బక్కన్న ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

స్థల వివాదంలో ఒకరికి కత్తిపోట్లు



తలకు గాయంతో చిన్నయ్య

సోన్: స్థల వివాదంలో ఒకరిని కత్తితో పొడిచిన సంఘటన మండలంలోని న్యూబొప్పారంలో శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన వేముల శ్రీనివాస్ తన ప్లాటును అదే గ్రామానికి చెందిన వేరే వ్యక్తికి విక్రయించాడు. తనను కాదని ఎలా అమ్ముతావని వరుసకు మేనమామ అయిన కనికరం చిన్నయ్య అడిగే క్రమంలో ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో చిన్నయ్య శ్రీనివాస్‌పై కారంపొడి చల్లి కత్తితో పొడిచాడు. శ్రీనివాస్ కోపంతో చిన్నయ్య తలపై కర్రతో కొట్టడంతో గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు అంబులెన్స్‌కు సమాచారం అందించారు. ఇద్దర్ని వేరువేరుగా అంబులెన్స్‌లో నిర్మల్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.



కత్తిపోట్లకు గురై చికిత్స పొందుతున్న శ్రీనివాస్

గిరి గూడేలకు పండుగ శోభ

- ఆదివాసీ సంస్కృతి.. సంప్రదాయాల సౌరభం
- నాలుగు మాసాలు వివిధ పండుగలు
- అకాడితో ప్రారంభమై దీపావళితో ముగింపు
- కుల దేవతలకు ప్రత్యేక పూజలు
- ఆదివాసీ పల్లెల్లో కోలాహలం



మేకతో జాతకం చూస్తున్న ఆదివాసీలు

కెరమెరి(ఆసిఫాబాద్): మారుతున్న ఆధునిక కాలంలోనూ ఆదివాసీలు తమ ఆచారాలు, సంప్రదాయాలు కొనసాగిస్తున్నారు. సమాజంలో ఎన్నో మార్పులు వస్తున్నప్పటికీ ఆదివాసీలు నేటికీ పుడమితల్లిని పూజిస్తూ కాలం వెల్లదీస్తున్నారు. పండుగలు, పెళ్లిళ్లు, సంస్కృతి, ఆచార వ్యవహారాల్లోనూ.. తమకు మరెవరూ సాటిరారని నిరూపిస్తున్నారు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఆదివాసీలు. వారి ఇళ్లల్లో జరిగే వివాహాల్లో వైవిధ్యం ఉంటుంది. నూతనత్వం కనిపిస్తుంది. పండుగల్లోనూ కొత్తదనం కనిపిస్తుంది. ఆషాఢ మాసంలో వచ్చే అకాడి పండుగతో ప్రారంభమయ్యే ఆదివాసీల పండుగలు, ఉత్సవాలు దీపావళితో ముగుస్తాయి. నాలుగు మాసాల పాటు ఆదివాసీ గూడేల్లో వివిధ రకాల పండుగలు సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారు. ఉమ్మడి జిల్లాలోని ఆదివాసీలు అకాడి పండుగలో జరిపే ఇతివృత్తంపై 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం..

అకాడి..

ఆషాఢమాసంలో ప్రథమంగా వచ్చే పండుగ అకాడి. పాడిపంటలకు రక్షణ కల్పించే అడవిదేవతగా భావించే రాజుల్‌పేన్‌ను పూజిస్తారు. నెలవంక కనిపించగానే జిల్లాలోని ప్రతీ గ్రామంలో దీనిని నిర్వహిస్తారు. అకాడి పండగను కొందరు పౌర్ణమి వరకు నిర్వహిస్తే మరికొందరు అమావాస్య వరకు నిర్వహిస్తారు. అనాదిగా వస్తున్న ఆచారమని ఆదివాసీ పెద్దలు, కటోడాలు పేర్కొంటున్నారు.

ఆకిపేన్..



రేఖ దాటి అడవిలోకి వెళ్తున్న పశువులు

అడవిలో ఆకులు చిగురించి పచ్చగా మారుతున్న క్రమంలో ఆదివాసీలు ఆకిపేన్‌కు పూజలు చేస్తారు. ఈ కాలంలో అడవికి వెళ్లిన మూగజీవాలకు రక్షణగా ఉండాలని, ఎలాంటి హాని తలపెట్టవద్దని, పంటలు అధికదిగుబడి సాధించాలని పూజలు చేస్తారు. ఈ సందర్భంగా లక్ష్మణరేఖ లాంటి గీతను గీస్తారు. ప్రత్యేకంగా తయారు చేసిన తుర్రను ఊదడంతో పశువులు అడవిలోకి పరుగెత్తాయి. కోడి, మేకలతో జాతకం చెబుతారు.

విజ్జపేన్..!

పెర్సాపేన్, రాజుల్‌దేవత వద్దకు విత్తనాలను తీసుకెళ్లి పూజలు చేస్తారు. పంటలకు ఎలాంటి హాని కలగకుండా చూడాలని పెర్సాపేన్‌కు మొక్కుతారు. అంతకు ముందు గ్రామంలో ఉన్న విత్తనాలను ఒక వద్దకు చేర్చి కుల దేవతలకు అందరు కలిసి పూజలు నిర్వహిస్తారు. అనంతరం కటోడా వాటిని అందరికీ అందిస్తారు. ఆ తర్వాతే పొలం పనులు ప్రారంభిస్తారు.



పెర్సాపేన్‌కు మొక్కుతున్న ఆదివాసీలు

వన భోజనాలు



పెద్ద సాకడలో ఆకిపేన్ వద్ద పూజలు

వనాలతో అతి సాన్నిహిత్యమున్న ఆదివాసీలు అకాడిలో వనదేవతకు ప్రత్యేక పూజలు చేస్తారు. గ్రామ పొలిమేరలో ఉన్న బాత్రి చెట్టుకింద దేవతల ప్రతిమలను శుద్ధి చేస్తారు. పుసుపుతో గీతలు గీస్తారు. గీత ఎదుట బియ్యంపోసి రాజుల్‌పేన్‌కు పూజలు చేస్తారు. అక్కడే వండిన నైవేద్యాన్ని ఉండలుగా చేసి అడవిదేవతకు చూపిస్తారు. పొలం పనులు చేస్తుండగా వన్యమృగాలు, విషజంతువులు తమదరికి చేరవద్దని మొక్కుతారు.

'శీత్ల' పండుగ

శీత్ల భవాని లంబాడీల దేవత. పశువుల ఆరోగ్యం, తండా సౌభాగ్యం కోసం శీత్ల భవానికి పూజలు చేయడం లంబాడీల ఆనవాయితీ. కలరా వంటి వ్యాధుల బారి నుంచి కాపాడుతుందని వారి నమ్మకం. ఆషాఢమాసంలో ఒక మంగళవారం గ్రామ సరిహద్దులోని పొలిమేరలో ఉన్న కూడలి వద్ద శీత్ల భవానీని ప్రతిష్ఠిస్తారు. మహిళలు, యువతులు నెత్తిన బోనం ఎత్తుకుని వస్తారు. నైవేద్యంగా పాయసం సమర్పిస్తారు. కోళ్లు, మేకలను బలిచ్చి వాటిపైనుంచి పశువులను దాటిస్తారు. పశు సంపద వృద్ధి చెందాలని, పాడిపంటలు బాగా పండాలని, ఎలాంటి దుష్టశక్తులు దరి చేరకుండా ఉండాలని శీత్ల మాతను పూజిస్తారు.

ప్రతీ పండుగకు ప్రత్యేకత



ఆదివాసీలు జరుపుకునే ప్రతీ పండుగకు ప్రత్యేకత ఉంది. అకాడి నుంచి ప్రారంభమైన పండుగలు నాలుగు మాసాల పాటు కొనసాగుతాయి. దీపావళికి గుస్సాడీ దీక్ష స్వీకరించే వారు ఇప్పుడే కుల దేవతలకు మొక్కుకుంటారు. కార్యం నెరవేరాక దీక్ష చేపడతారు. పూజల తర్వాత ఏత్మాసార్ పేన్‌కు పూజలు చేస్తాం. వన భోజనం ఐకమత్యాన్ని తెలియజేస్తుంది.

– కుర్సెంగ దుందేరావు, ఆదివాసీ నాయకుడు, చౌపన్‌గూడ

'21న బంద్ విజయవంతం చేయాలి'



నినాదాలు చేస్తున్న తుడుందెబ్బ నాయకులు

ఆదిలాబాద్‌రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కుమురం భీం కన్జర్వేషన్ కారిడార్ పేరిట తీసుకువచ్చిన జీవో 49 వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 21న చేపట్టిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బంద్ విజయవంతం చేయాలని ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుందెబ్బ) రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోడం గణేశ్ కోరారు. శనివారం మావల మండలంలోని కుమురంభీం గూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1/70, పెసా చట్టాలు ఆదివాసీల అస్తిత్వాన్ని, మనుగడను, హక్కులను ఉల్లంఘిస్తున్నాయన్నారు. అన్నివర్గాల ప్రజలు, వ్యాపారులు, విద్యాసంస్థలు, సినిమా థియేటర్లు, బ్యాంకులు, పెట్రోల్ బంకులు పూర్తిస్థాయిలో బంద్‌కు సహకరించాలని కోరారు. సమావేశంలో తుడుం దెబ్బ జిల్లా ప్రధాన కార్యదర్శి వెట్టి మనోజ్, మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు గోడం రేణుక, ఉపాధ్యక్షురాలు ఉయిక ఇందిరా, డివిజన్ అధ్యక్షురాలు సోయం లలిత, ఆదిలాబాద్ డివిజన్ ఉపాధ్యక్షుడు ఆత్రం గణపతి, మావల మండల అధ్యక్షుడు వెడ్మ ముకుంద్, ఉపాధ్యక్షుడు తొడసం ప్రకాష్, కుమ్ర వినోద్, తదితరులు పాల్గొన్నారు.

పశువులను తరలిస్తున్న రెండు వాహనాలు పట్టివేత

బెజ్జూర్: అక్రమంగా పశువులు తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకున్నట్లు ఎస్సై సర్దార్ పాషా తెలిపారు. శనివారం ఉదయం బెజ్జూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళ్తున్న రెండు బొలెరో వాహనాలను ఆపి తనిఖీ చేయగా ఒక్కో వాహనంలో ఐదు చొప్పున పశువులు ఉన్నాయని, పెంచికల్‌పేట్ నుంచి చేద్వాయి వెళ్తున్నట్లు చెప్పారు. పశువైద్యాధికారి, గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా తీసుకెళ్తున్నట్లు గుర్తించామని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

ఫోన్ల రికవరీకి ప్రత్యేక బృందం ఏర్పాటు

- ఎస్పీ అఖిల్ మహాజన్
- పోగొట్టుకున్న 109 సెల్‌ఫోన్లు బాధితులకు అందజేత



సెల్‌ఫోన్ అందజేస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్‌టౌన్: బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను తిరిగి రికవరీ చేసేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. పోగొట్టుకున్న, చోరీకి గురైన రూ.16 లక్షల విలువ గల 109 సెల్‌ఫోన్లను శనివారం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లోని సమావేశం మందిరంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఫోన్ పోయిన వెంటనే https://www.ceir.gov.in వెబ్‌సైట్‌లో లేదా సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 900 సెల్‌ఫోన్లను బాధితులకు తిరిగి అందజేసినట్లు తెలిపారు. మీసేవ కేంద్రాల్లో ఎలాంటి చలాన్లు కట్టకుండా ఫిర్యాదు చేయవచ్చన్నారు. దొంగిలించిన ఫోన్లను కొనుగోలు చేస్తే చట్టప్రకారంగా చర్యలు తీసుకుంటామని దుకాణాల యజమానులను హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ ఎల్.జీవన్‌రెడ్డి, ఏఆర్ డీఎస్పీ కమతం ఇంద్రవర్ధన్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ డి.వెంకటి, ప్రత్యేక బృందం సభ్యులు ఎస్సై పి.గోపీకృష్ణ, ఎస్.సంజీవ్, ఎం.ఎ.రియాజ్, మజీద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి

- ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా



మాట్లాడుతున్న పీవో ఖుష్బూ గుప్తా

ఉట్నూర్‌రూరల్: గిరిజన విద్యార్థులకు మెరుగైన విద్య, వైద్యం అందించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ఉమ్మడి జిల్లా ఆశ్రమ పాఠశాలల డీటీడీవో, ఏటీడీవోలు, ఏఎస్‌ఎంలను ఆదేశించారు. శనివారం కేబీ కాంప్లెక్స్‌లోని సమావేశ మందిరంలో ఓరియంటేషన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల్లో రక్తహీనత లేకుండా చూడాలన్నారు. మోవా లడ్డూ, విటమిన్ 'సి' పాలిక్ యాసిడ్ వంటి మాత్రలను వారంలో రెండుసార్లు మధ్యాహ్న భోజనం తర్వాత ఇవ్వాలని సూచించారు. స్నానానికి వేడి నీళ్లు ఉండేలా చూడాలన్నారు. ప్రతీరోజు విద్యార్థుల హిమోగ్లోబిన్ శాతం పరిశీలించాలని ఏఎన్‌ఎంలను ఆదేశించారు. ఆశ్రమ పాఠశాలల్లో వార్డెన్లు 24 గంటలు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో డీడీ అంబాజీ, ఏడీఎంహెచ్‌వో కుడిమెత మనోహర్, తదితరులు పాల్గొన్నారు.


చేపలు పట్టేందుకు వెళ్లి ఒకరు మృతి



భీమేశ్ మృతదేహం

సారంగపూర్: చేపలు పట్టేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు స్వర్ణ ప్రాజెక్టులో పడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన వివరాల మేరకు జౌళి గ్రామానికి చెందిన పోటిండ్ల భీమేశ్ (34) శుక్రవారం సాయంత్రం స్వర్ణ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చేపలు పట్టే క్రమంలో ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడిపోవడంతో మృతి చెందాడు. మృతుని బంధువులు శనివారం ఉదయం ప్రాజెక్టు పరిసరాల్లో గాలించగా మృతదేహం లభ్యమైంది. కాళ్లకు వల చుట్టుకోవడంతో నీటమునిగి మృతిచెంది ఉంటాడని భావించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై శ్రీకాంత్ సంఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేసుకున్నారు. మృతునికి గతంలో వివాహమైనా విడాకులు కావడంతో ఒంటరిగానే ఉంటున్నాడని బంధువులు తెలిపారు.

చికిత్స పొందుతూ కార్మికుడు..



శ్రీనివాస్(ఫైల్)

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని స్టోర్స్‌లో జనరల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కొత్తపల్లి శ్రీనివాస్ (45)చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. తోటి కార్మికులు తెలిపిన వివరాల మేరకు గత నెలలో విధి నిర్వహణలో ఉండగా, తేనెటీగలు కుట్టడంతో స్టోర్ అధికారి సూచన మేరకు ఒక్కడే ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకుంటున్నాడు. సదరు అధికారి రమ్మని చెప్పడంతో ట్రీట్‌మెంట్ పూర్తి కాకుండానే వచ్చినట్లు సమాచారం. డిశ్చార్జ్ చేయకుండానే ఎందుకు వెళ్లావని ఆస్పత్రి సిబ్బంది అడగడంతో మళ్లీ ఆస్పత్రికి వెళ్లాడు. ఈక్రమంలో పది రోజుల క్రితం అధిక రక్తపోటుకు గురికావడంతో కేకే డిస్పెన్సరీకి వెళ్లగా రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రికి రెఫర్ చేశారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ తరలించి చికిత్స చేయించినా నయం కాకపోవడంతో హైదరాబాద్‌లోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో ఉండగా తేనెటీగలు కుడితే బాధితునితో పాటు మరో సహాయకుడిని ఎందుకు పంపలేదని కార్మికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు ఎదురుకాకుండా చర్యలు తీసుకోవాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు.

నీళ్లనుకుని పురుగుల మందు తాగిన యువకుడు

- చికిత్స పొందుతూ మృతి

సిరికొండ: ఈ నెల 15న పురుగుల మందుతాగిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై పూజ తెలిపారు. మండలంలోని కన్నాపూర్ గ్రామానికి చెందిన ఆడ ప్రవీణ్‌కుమార్ (22) మంగళవారం రాత్రి పంటచేనుకు కాపలా వెళ్లాడు. దాహం వేయడంతో నిద్రమత్తులో నీళ్ల బాటిల్ అనుకుని పురుగుల మందు తాగాడు. వెంటనే ఇంటికి వచ్చి విషయం తల్లిదండ్రులకు తెలపడంతో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

మొరం టిప్పర్లు పట్టివేత

దండేపల్లి: మండలంలోని నెల్కివెంకటాపూర్ సమీపంలో అక్రమంగా మొరం తరలిస్తున్న రెండు టిప్పర్లను మైనింగ్ అధికారులు శనివారం పట్టుకున్నట్లు తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే తెలిపారు. పట్టుకున్న టిప్పర్లను దండేపల్లి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

అప్పులబాధతో సింగరేణి కార్మికుడు ఆత్మహత్య



రమేశ్ (ఫైల్)

మంచిర్యాలక్రైం: అప్పుల బాధతో సింగరేణి కార్మికుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై మజారుద్దీన్, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు ఎస్సార్పీ–1 గనిలో కోల్‌ఫిల్లర్‌గా విధులు నిర్వర్తిస్తున్న జిల్లా కేంద్రంలోని అశోక్ రోడ్డుకు చెందిన బైరి రమేశ్ (36) తన స్నేహితుల వద్ద రూ.5 వడ్డీచొప్పున సుమారు రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ప్రతీనెల వడ్డీ మాత్రమే కడుతున్నాడు. అసలు ఎలా చెల్లించాలో తెలియక మనస్తాపానికి గురై ఈనెల 17న గడ్డిమందు తాగాడు. ఇంటికి వచ్చి వాంతులు, విరేచనాలు చేసుకుని కిందపడిపోవడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతునికి భార్య శ్వేత, కుమారుడు ఉన్నారు. శ్వేత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..



విశ్వేశ్వర్‌రావ్ (ఫైల్)

ఇంద్రవెల్లి: ఉరేసుకుని ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఏఎస్సై రమేశ్ తెలిపిన వివరాల మేరకు శంకర్‌గూడ గ్రామ పంచాయతీ పరిధిలోని దుబ్బగూడకు చెందిన ఆడ విశ్వేశ్వర్‌రావ్ (48) నాలుగేళ్లుగా మానసిక స్థితి కోల్పోయాడు. కుటుంబ సభ్యులు పలు ఆస్పత్రుల్లో చికిత్స చేయించినా నయం కాలేదు. శనివారం కుటుంబ సభ్యులు వ్యవసాయ పనులకు వెళ్లగా ఇంట్లో దూలానికి ఉరేసుకున్నాడు. సాయంత్రం ఇంటికి వచ్చిన కుటుంబ సభ్యులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం ఉట్నూర్ ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య సీతాబాయి, కుమారులు యశ్వంత్‌రావ్, రాజేశ్ ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఇంద్రవెల్లి: రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయలైన ఘటన శనివారం మండలంలో చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల మేరకు ఈశ్వర్‌నగర్ గ్రామానికి చెందిన అందుసింగ్ బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టింది. కారు ఆగకుండా వెళ్లిపోవడంతో విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే గుడిహత్నూర్ పోలీసులకు సమాచారం అందించడంతో కారును అదుపులో తీసుకుని ఇంద్రవెల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తీవ్రగాయాలైన అందుసింగ్‌ను స్థానికులు వెంటనే 108లో ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించారు. ఈ విషయంపై ఏఎస్సై రమేశ్‌ను సంప్రదించగా ఘటనపై ఇప్పటి వరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదన్నారు.

ఇన్నోవేషన్ వ్యవస్థలో విద్యార్థుల పాత్ర కీలకం

- ఓఎస్డీ, ఏవో ప్రొఫెసర్ మురళీదర్శన్



మాట్లాడుతున్న ఓఎస్డీ మురళీదర్శన్

బాసర: భారత ఇన్నోవేషన్ వ్యవస్థలో విద్యార్థుల పాత్ర ఎంతో కీలకమని ఓఎస్డీ, ఏవో ప్రొఫెసర్ మురళీదర్శన్ అన్నారు. శనివారం ఆర్జీయూకేటీలో విద్యార్థులకు స్టార్టప్, ఆంత్రప్రెన్యూర్‌షిప్ మార్గదర్శక విలువలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ప్రధానంగా ప్రారంభ దశ స్టార్టప్‌లలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో స్టార్టప్‌లపై ఆసక్తిని పెంపొందించాలనే లక్ష్యంతో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్థిరత్వం, విస్తరణ ప్రాముఖ్యతలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు. కళాశాలలో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి, నాగసాయి కుమార్, దిల్బహార్ అహ్మద్, చరణ్‌రెడ్డి, వివిధ విభాగాలకు చెందిన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బ్యాడ్మింటన్ పోటీలు



పరిచయం చేసుకుంటున్న శ్రీకాంత్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రం శివారులోని కొండాపూర్ వద్దగల నిర్మల్ స్పోర్ట్స్ అకాడమీలో మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు మూడో రోజు రసవత్తరంగా సాగాయి. శనివారం క్వార్టర్ ఫైనల్స్ నిర్వహించారు. అండర్ 19 బాలురు, బాలికలకు సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ విభాగాల్లో పోటీలు కొనసాగుతున్నాయి. ఆదివారం ఫైనల్ పోటీలు నిర్వహించనుండగా ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ అంజిరెడ్డి హాజరుకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి శ్రీకాంత్‌రెడ్డి, నిర్మల్ అర్బన్ ఎమ్మార్వో రాజు, మున్సిపల్ డీఈ హరిభువన్, మంచిర్యాల జిల్లా స్టార్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు ముఖేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పుల్లూరి సుధాకర్, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ కమిటీ కన్వీనర్ కిషోర్, కో కన్వీనర్ వన్నెల భూమన్న, కోఆర్డినేటర్లు సందీప్, మధుకర్ గౌడ్, నందకుమార్, తదితరులు పాల్గొన్నారు.

నా ఎదుగుదలను ఓర్వలేకే దుష్ప్రచారం

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

కైలాస్‌నగర్: రాజకీయంగా తన ఎదుగుదలను ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్ పార్టీల నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని పెన్‌గంగా గెస్ట్‌హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైక్రోఫైనాన్స్‌లో ఉద్యోగాల పేరిట నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసి నిందితుడు పరారైన ఘటనకు సంబంధించి తనపై జరుగుతున్న ప్రచారంపై వివరణ ఇచ్చారు. నిందితుడు తనకు స్నేహితుడేనని, కలిసి చదువుకున్నామన్నారు. అయితే నిందితుడి ఫౌండేషన్‌కు తన ఫౌండేషన్‌కు ఎలాంటి సంబంధం లేదన్నారు. తాను ఎమ్మెల్యే కావడం జీర్ణించుకోలేని బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియా, పత్రికలు, యూట్యూబ్ చానళ్లలో తనపై తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని ఆరోపించారు. ఇందుకు బాధ్యులైన వారికి లీగల్ నోటీసులు జారీ చేయడంతో పాటు ఎస్పీకి ఫిర్యాదు చేస్తానన్నారు. మోసపోయిన గిరిజన యువతకు న్యాయం చేసేలా తనవంతు కృషి చేస్తానని వెల్లడించారు.

అటవీ అధికారి లంచం తీసుకున్నాడని వీడియో వైరల్

గుడిహత్నూర్ : హర్కాయికి చెందిన అటవీ బీట్ ఆఫీసర్ రూ.20 వేలు లంచం తీసుకున్నట్లు వీడియో వైరల్‌గా మారింది. మండలంలోని కొల్హారీ గ్రామానికి చెందిన వడ్రంగి ఎనుగుర్తి సురేష్ తన ఇంట్లో ఉన్న పాత కలపతో ఇంటి కోసం కిటికీలు, తదితర సామగ్రి తయారు చేస్తుండగా ఓ అజ్ఞాత వ్యక్తి సమాచారంతో వెళ్లిన బీట్ ఆఫీసర్ విశ్వజిత్ వాటిని పరిశీలించి రూ.20వేలు జరిమానా విధించాడు. దీంతో ఈ నెల 15న సురేష్ సదరు అధికారికి డబ్బులు చెల్లించి రశీదు పొందాడు. ఈ తతంగాన్ని ఓ వ్యక్తి వీడియో తీయగా అది లంచం ఇస్తున్నట్లు వక్రీకరించడంతో ఈ విషయం వైరల్‌గా మారింది. కాగా అటవీ అధికారి వడ్రంగికి ఇచ్చిన రశీదుపై ఆంధ్రప్రదేశ్ ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్ అని రాసి ఉంది. ఈ విషయమై జిల్లా అటవీ అధికారిని వివరణ కోరగా ఏపీ, తెలంగాణ ఫారెస్ట్ రూల్స్ ఒకేలా ఉండడం వల్ల గతంలో ప్రభుత్వం వీటిని కొనసాగించడానికి వెసులుబాటు కల్పించిందన్నారు.

కలప స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పిప్పల్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని దహిగూడలో ఓ ఇంట్లో నిల్వ ఉంచిన 38 కలప దుంగలను శనివారం స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు గ్రామానికి చెందిన గంటుబాయి నివాసంలో దాడులు నిర్వహించగా కలప లభ్యం కావడంతో స్వాధీనం చేసుకుని గంటుబాయి, మీరాబాయి, దస్రూపై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం నిందితులు పరారీలో ఉన్నారన్నారు.

బెల్టుషాపు నిర్వాహకులపై కేసు

ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రాంపూర్‌లో బెల్టుషాపులు నిర్వహిస్తున్న బెజ్జవార్ కిషన్, దర్శనాల రాజుపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇరువురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.